TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా.. ? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ... ? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...

సంపుటి : 3 సంచిక : 280 | శనివారం 03-10-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ మౌనిక | పేజీలు : 8 వెల 3 /-

# జాతిపితకు ఘననివాళి

## గాంధీ జయంతి సందర్భంగా బాపూ ఘాట్‌లో నివాళులు.

- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, సీఎం రేవంత్ రెడ్డి నివాళులు.
- బాపూ ఘాట్‌లో డిజిటల్ మ్యూజియం ప్రారంభం.
- కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొన్నారు.
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ హాజరు.
- మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.
- సీఎస్ సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్ హాజరు.
- పలువురు ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.





జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా లంగర్ హౌస్ బాపూ ఘాట్ లో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాపూ ఘాట్ లో డిజిటల్ మ్యూజియాన్ని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అజరుద్దీన్ , ఎంపీ వేం నరేందర్ రెడ్డి , ప్రభుత్వ సలహాదారు వి హనుమంత రావు, ప్రభుత్వ విప్ లు అద్దంకి దయాకర్, రామచంద్ర నాయక్ , ఎంఎల్ఏలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ఐఐఏసీలో మొక్కలు నాటిన కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్

- మనసు పరిశుభ్రంగా ఉన్నప్పుడే నిజమైన స్వచ్ఛత

ప్రత్యేక ప్రచారం--6, 'స్వచ్ఛతా హీ సేవ--2026'లో భాగంగా కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని వసంత్‌కుంజ్ ఇండియా ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్ (ఐఐఏసీ) ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని 'ఏక్ పేడ్ మా కే నామ్' నినాదంతో అక్టోబర్ 1న చేపట్టిన ఈ కార్యక్రమానికి కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) అర్జున్ రామ్ మేఘ్వాల్ నాయకత్వం వహించారు.

2లో

## ప్రపంచ వాణిజ్య వక్రీకరణల సవరణకు డబ్ల్యూటీఓ నిబంధనలే ప్రామాణికం

**జీ20 వాణిజ్య మంత్రుల సమావేశంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్**

**వెట్టిచాకిరి నిర్మూలనకు భారత్ కట్టుబడి ఉంది**

**ఆధారాలతో కూడిన వాణిజ్య చర్యలకే మద్దతు**




ప్రపంచ వాణిజ్యంలో ఏర్పడుతున్న వక్రీకరణలను సరిచేసేందుకు ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) నిబంధనలకు అనుగుణమైన విధానాలనే అనుసరించాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు. అమెరికాలోని విస్కాన్సిన్ రాష్ట్రం మిల్వాకీలో జరిగిన జీ20 వాణిజ్య మంత్రుల సమావేశం ముగింపు రోజు ఆయన పాల్గొని పలు కీలక అంశాలపై ప్రసంగించారు.

2లో

# 40 ఏళ్లుగా మరసం కొనసాగడం కవుల నిబద్ధతకు నిదర్శనం

## మంజీరా రచయితల సంఘం మహాసభలో మాజీ మంత్రి హరీశ్‌రావు



2లో

సంఘాన్ని ఏర్పాటు చేయడం సులువేనని, అయితే ఎన్నో ఒత్తిళ్లను ఎదుర్కొంటూ 40 ఏళ్లుగా మంజీరా రచయితల సంఘం (మరసం) కొనసాగడం అందులోని కవుల నిబద్ధత, నిజాయితీకి నిదర్శనమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి. హరీశ్‌రావు అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మరసం 40 వసంతాల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

మంజీరా రచయితల సంఘంతో తనకు రెండు దశాబ్దాలకు పైగా అనుబంధం ఉందని హరీశ్‌రావు తెలిపారు. ప్రభుత్వాల ఒత్తిళ్లు, బెదిరింపులు ఎదురైనా సంస్థ తన ప్రస్థానాన్ని కొనసాగించిందన్నారు. 1992 మద్యపాన నిషేధ ఉద్యమం, ఆకలి చావులు, రైతుల ఆత్మహత్యలు, గుట్కా నిషేధం తదితర ప్రజా, సామాజిక సమస్యలపై మరసం పోరాడిందని పేర్కొన్నారు.

**'నాగేటి సాలల్లో నా తెలంగాణ'కు ప్రత్యేక గుర్తింపు**

తెలంగాణ ఉద్యమ తొలినాళ్లలో తెలంగాణ రచయితలు, మేధావులపై ఉన్న చిన్నచూపును నందిని సిద్ధారెడ్డి తెలంగాణ రచయితల వేదిక ద్వారా తిప్పికొట్టారని హరీశ్‌రావు అన్నారు. సిద్ధారెడ్డి రచించిన 'నాగేటి సాలల్లో నా తెలంగాణ' పాట ఉద్యమానికి కొత్త ఊపునిచ్చిందని, అమరులకు నివాళులర్పించే ఆయన పాటలు ఉద్యమంలో కీలక పాత్ర పోషించాయని తెలిపారు. పదవులు, డబ్బు కంటే సిద్ధాంతానికే ప్రాధాన్యం ఇచ్చిన సిద్ధారెడ్డి, తనకు వచ్చిన అవకాశాలను సైతం వదులుకున్నారని పేర్కొన్నారు.

## తెలంగాణ ప్రజా రవాణాలో డిజిటల్ విప్లవం

- ఆర్టీసీ--మెట్రో ఉమ్మడి పాస్, 'వీవమఅఎనెవ్' యాప్ ప్రారంభం
- 12 సంవత్సరాల తర్వాత ఆటో రిక్షా చార్జీల సవరణ చేస్తూ జీవో విడుదల
- మంత్రులకు డబ్బులు ఇచ్చి ఆర్టీసీ - మెట్రో కామన్ పాస్ లు కొనుగోలు చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- కామన్ పాస్ ద్వారా రేపు బేగంపేట నుండి మెట్రోలో అనంతరం ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేయనున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు

2లో




## పట్టాలెక్కనున్న మరో వందేభారత్ స్లీపర్.. ఏపీలో ఈ స్టేషన్ల మీదుగా!



2లో

## మియాపూర్‌లో యువ వైద్యురాలి అనుమానాస్పద మృతి



2లో

## శంషాబాద్‌లో ప్రయాణికుడి వీరంగం.. ఎమర్జెన్సీ డోర్ తెరిచేందుకు యత్నం



హైదరాబాద్: శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి టేకాఫ్ అవుతున్న విమానంలో ఓ ప్రయాణికుడు వీరంగం సృష్టించారు. గురువారం అర్ధరాత్రి దాటాక ఇండిగో విమానం శంషాబాద్ నుంచి కడపకు బయలుదేరింది. విమానం టేకాఫ్ అవుతుండగా ఓ ప్రయాణికుడు ఎమర్జెన్సీ డోర్ తెరిచేందుకు ప్రయత్నించగా.. వెంటనే ఎయిర్‌లైన్స్ సిబ్బంది అప్రమత్తమై అతడిని పట్టుకున్నారు. అనంతరం ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. దీనిపై కేసు నమోదైంది. ఈ ఘటనతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు.

# దేశ ప్రజలు కాంగ్రెస్ ముక్త్ భారత్ కోరుకుంటున్నారు: బండి సంజయ్



2లో

జమ్మికుంట: దేశ ప్రజలు కాంగ్రెస్ ముక్త్ భారత్ కోరుకుంటున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా కరీంనగర్ జిల్లా జమ్మికుంట గాంధీచౌక్‌లో మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. వారసత్వ రాజకీయాలకు మహాత్మా గాంధీ వ్యతిరేకమని, గాంధీ అసలైన వారసుడు ప్రధాని నరేంద్ర మోదీ, భాజపానే అన్నారు. ప్రస్తుతం ఉన్న ఇటలీ నేషనల్ కాంగ్రెస్ డూప్లికేట్ గాంధీ కుటుంబానిదేనని విమర్శించారు. రాబోయే రోజుల్లో గాంధీ వారసులుగా తెలంగాణ రాష్ట్రంలో రామరాజ్యం తీసుకొస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేవుళ్ల పేరుతో హిందువులను చీల్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

# సంపాదకీయం

## పాన్ ఐఐటీ.. రాష్ట్ర భవిష్యత్తుకు ఇన్నోవేషన్ ఇంజిన్

ఒక రాష్ట్రాన్ని మార్చేది కేవలం భారీ పెట్టుబడులు కాదు. ఆ పెట్టుబడులకు దారితీసే ఆలోచనలు, ఆ ఆలోచనలను ఆవిష్కరణలుగా మలిచే పరిశోధన, ఆ ఆవిష్కరణలను పరిశ్రమలుగా తీర్చిదిద్దే సమర్థ వ్యవస్థ. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వేగంగా మారుతున్న ప్రస్తుత సమయంలో ఒక రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించేది కేవలం సహజ వనరులు మాత్రమే కాదు.. జ్ఞానం, నైపుణ్యం, సాంకేతికత, ఆవిష్కరణ సామర్థ్యం. అందుకే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణంలో పాన్ ఐఐటీ వంటి మేధో వేదికకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది.

నేడు విజయవాడలో జరగనున్న పాన్ ఐఐటీ ఆంధ్రప్రదేశ్ సమ్మిట్ ఈ దిశగా ఒక ముఖ్యమైన ప్రయత్నం. దేశ విదేశాల్లో ఉన్న ఐఐటీ పూర్వ విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, సాంకేతిక నిపుణులు, పరిశోధకులు, విద్యావేత్తలు, పాలసీ రూపకర్తలను ఒకే వేదికపైకి తీసుకురావడం దీని ప్రధాన ఉద్దేశం. వారి అనుభవం, పరిజ్ఞానం, పరిచయాలు, పెట్టుబడి సామర్థ్యాన్ని ఏపీ అభివృద్ధికి అనుసంధానం చేయడం ద్వారా కొత్త అవకాశాలను సృష్టించవచ్చు. అమెరికాలో స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం చుట్టూ ఏర్పడిన పరిశోధన, పరిశ్రమ వాతావరణం సిలికాన్ వ్యాలీకి బలమైన పునాది వేసింది. జర్మనీలోని ఫ్రాన్‌హోఫర్ సంస్థలు పరిశోధనను పరిశ్రమ అవసరాలతో అనుసంధానం చేసి సాంకేతికతను వాణిజ్యీకరణ దిశగా తీసుకెళ్తున్నాయి. ఇజ్రాయెల్ స్టార్టప్ వ్యవస్థ, సింగపూర్ పరిశోధన-- పరిశ్రమ అనుసంధానం, తైవాన్ సెమీకండక్టర్ పర్యావరణం కూడా నాలెడ్జ్ ఆర్థిక శక్తిగా ఎలా మారుతుందో చూపిస్తున్నాయి.

ఈ నమూనాల నుంచి రాష్ట్రం నేర్చుకోవాల్సిన ప్రధాన విషయం ఒక్కటే. ప్రతిభను ఒకచోట చేర్చడం మాత్రమే కాదు.. ఆ ప్రతిభను రాష్ట్రాభివృద్ధి అవసరాలతో అనుసంధానం చేయాలి. రాష్ట్రంలోని సమస్యలకు ఐఐటీలు, పరిశోధన సంస్థలు, పరిశ్రమలు కలిసి పరిష్కారాలు చూపే విధానం రావాలి. కొత్త ఆలోచనలు ప్రోటోటైప్‌లుగా మారాలి. ప్రోటోటైప్‌లు స్టార్టప్‌లుగా మారాలి. స్టార్టప్‌లకు పెట్టుబడులు రావాలి. అవి పరిశ్రమలుగా ఎదిగి ఉపాధి కల్పించాలి. ఆ ఉపాధి, ఉత్పాదకత చివరకు... రాష్ట్ర ఆర్థిక వృద్ధికి బాట వేయాలి అనే వ్యవస్థ రాష్ట్రంలో ఏర్పడాలి. ఇదే నిజమైన ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్.

దేశం కూడా ఇదే దిశగా అడుగులు వేస్తోంది. ఇండియా ఏఐ మిషన్, నేషనల్ క్వాంటమ్ మిషన్, రీసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ వంటి కార్యక్రమాల ద్వారా కృత్రిమ మేధస్సు, క్వాంటమ్, డీప్‌టెక్, రోబోటిక్స్, సెమీకండక్టర్లు, బయోటెక్నాలజీ, మెడికల్ డివైజెస్ వంటి రంగాల్లో పరిశోధన, ప్రైవేట్ పెట్టుబడులకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ జాతీయ అవకాశాలను రాష్ట్ర అవసరాలతో అనుసంధానం చేసుకోవడం కీలకం. ఈ నేపథ్యంలో అమరావతిలో ఏఐ, క్వాంటమ్ రంగాలకు ప్రత్యేక యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటుకు ఎన్ఐఈఎల్ఐటీ, రాష్ట్రం మధ్య జరిగిన ఒప్పందం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. క్వాంటమ్ కంప్యూటింగ్ ఏఐ/ఎంఎల్, సైబర్ సెక్యూరిటీ, హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్, క్వాంటమ్ హార్డ్‌వేర్, ఏఐ--క్వాంటమ్ రీసెర్చ్, ఇండస్ట్రీ లింక్డ్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, డీప్‌టెక్ ఇంక్యుబేషన్ వంటి రంగాలను ఒకే పరిధిలోకి తీసుకురావాలనే ఆలోచన భవిష్యత్ సాంకేతిక అవసరాలకు అనుగుణంగా ఉంది. అమరావతి క్వాంటమ్ వ్యాలీలో ఐబీఎంతో భాగస్వామ్యం, క్వాంటమ్ కంప్యూటింగ్ మౌలిక వసతుల ఏర్పాటుకు జరుగుతున్న ప్రయత్నాలు కూడా ఈ దిశలోనే ఉన్నాయి.

అయితే ఇలాంటి ప్రాజెక్టులు, సంస్థలు ఏర్పడితేనే సరిపోదు. వాటి చుట్టూ పరిశోధన, పెట్టుబడి, పరిశ్రమ, స్టార్టప్ వ్యవస్థ ఏర్పడాలి. ఒక ఆలోచనకు నిధులు దొరకాలి. ఒక పరిశోధనకు పరిశ్రమ భాగస్వామ్యం కావాలి. ఒక స్టార్టప్‌కు మార్కెట్ దొరకాలి. ఒక విద్యార్థికి ప్రపంచస్థాయి మెంటార్ లభించాలి. ఒక పరిశ్రమకు అవసరమైన నైపుణ్యం రాష్ట్రంలోనే అందుబాటులో ఉండాలి.

అప్పుడే మేధస్సు ఆర్థిక విలువగా మారుతుంది. పాన్ ఐఐటీని ఈ మొత్తం వ్యవస్థకు

## దేశ ప్రజలు కాంగ్రెస్ ముక్త్ భారత్ కోరుకుంటున్నారు: బండి సంజయ్

మొదటి పేజీ తరువాయి

ఖైరతాబాద్‌లో 32 వేల మంది ముస్లింలు ఉంటే కాంగ్రెస్ పార్టీ గెలిచి తీరుతుందని ఆ పార్టీ నాయకులంటున్నారని, 2 లక్షల పైగా హిందువుల ఓట్లు ఉన్నాయనే విషయాన్ని మర్చిపోతున్నారన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంటేనే అభివృద్ధి సాకారం అవుతుందన్నారు.

## మియాపూర్‌లో యువ వైద్యురాలి అనుమానాస్పద మృతి

మొదటి పేజీ తరువాయి

మియాపూర్(హైదరాబాద్): మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హాఫీజ్ పేటలో ఓ యువ వైద్యురాలు (27) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. మూడు రోజుల క్రితం ఆమె వరంగల్ నుంచి స్నేహితుడితో కలిసి వచ్చి ఆదిత్య నగర్‌లోని ప్రైవేట్ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో బస చేశారు. కుటుంబ సభ్యులకు అందుబాటులో లేకపోవడంతో ఆందోళన చెందిన ఆమె తల్లిదండ్రులు శుక్రవారం.. ఫోన్ లొకేషన్ ఆధారంగా మియాపూర్ పోలీసులను సంప్రదించారు. వెంటనే స్పందించిన మియాపూర్ పోలీసులు సర్వీస్ అపార్ట్‌మెంట్‌ను గుర్తించి.. పరిశీలించగా అప్పటికే ఆమె అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఆమెతో పాటు వచ్చిన యువకుడు పరారీలో ఉన్నట్లు సీఐ జయరాం తెలిపారు. సంగారెడ్డికి చెందిన యువ వైద్యురాలు.. మహబూబ్‌నగర్‌లో వైద్య విద్య పూర్తి చేసుకుని.. వరంగల్‌లో ఇటీవలే పీడియాట్రిషన్ విభాగంలో పీజీ పూర్తి చేశారు.

## పట్టాలెక్కనున్న మరో వందేభారత్ స్లీపర్.. ఏపీలో ఈ స్టేషన్ల మీదుగా!

మొదటి పేజీ తరువాయి

సుదూర ప్రయాణాలు చేసే ప్రయాణికుల కోసం ఉద్దేశించిన వందేభారత్ స్లీపర్ రైలు మరో మార్గంలో త్వరలో అందుబాటులోకి రానుంది. దేశ ఆర్థిక రాజధాని ముంబయి, టెక్నాలజీ రాజధానిగా గుర్తింపు పొందిన బెంగళూరు మధ్య రెండో వందేభారత్ స్లీపర్ రైలు సేవలందించనుంది. దసరా కానుకగా ఈ రైలు సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ కొత్త రైలుకు రైల్వే బోర్డు ఆమోదం తెలపగా.. ప్రారంభ తేదీపై త్వరలోనే స్పష్టత రానుంది.

ముంబయి- బెంగళూరు వందేభారత్ స్లీపర్ రైలు వారానికి ఆరు రోజులు నడవనుంది. బెంగళూరు నుంచి సోమవారం మినహా, ముంబయి నుంచి మంగళవారం మినహా ఈ రైలు ప్రయాణికులకు సేవలందించనుంది. ప్రతి రోజూ రాత్రి 10 గంటలకు బెంగళూరులో బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 1.50 గంటలకు ముంబయి చేరుకుంటుంది. ముంబయి నుంచి రాత్రి 10.30 గంటలకు బయల్దేరే ఈ స్లీపర్ రైలు మరుసటి రోజు మధ్యాహ్నం 2.50 గంటలకు బెంగళూరు చేరుతుంది. మొత్తం 16 గంటల సమయం పడుతుంది.

ఆగే స్టేషన్లు ఇవే: బెంగళూరు -ముంబయి వందేభారత్ స్లీపర్ రైలు మార్గమధ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, గుంతకల్లు స్టేషన్లలో ఆగుతుంది. వీటితో పాటు రాయచూర్, కలబురగి, సోలాపూర్, పుణె, కల్యాణ్ స్టేషన్లలో హాల్ట్ ఉంటుంది. ప్రస్తుతం ముంబయి- బెంగళూరు నగరాల మధ్య ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్ నడుస్తుండగా.. దాదాపు 22 గంటల ప్రయాణ సమయం పడుతోంది. పశ్చిమ బెంగాల్‌లోని హౌవ్‌డా- అస్సాంలోని గువాహటి (కామాఖ్య) మధ్య తొలి వందేభారత్ స్లీపర్ రైలు ఈ ఏడాది జనవరిలో అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే.

## ప్రపంచ వాణిజ్య వక్రీకరణల సవరణకు డబ్ల్యూటీఓ నిబంధనలే ప్రామాణికం

మొదటి పేజీ తరువాయి

నిర్మాణాత్మక అదనపు ఉత్పత్తి సామర్థ్యం, ఉత్పాదకత, మోస్ట్ ఫేవర్డ్ నేషన్ (ఎంఎఫ్ఎన్) సూత్రం ఆధునికీకరణ, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థల్లో వెట్టిచాకిరి నిర్మూలన తదితర అంశాలపై జరిగిన సమావేశాల్లో పీయూష్ గోయల్ భారత్ వైఖరిని వివరించారు.

**భారత్‌లో అదనపు ఉత్పత్తి సామర్థ్యం లేదు**

ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ భారత్‌దేనని పీయూష్ గోయల్ తెలిపారు. దేశంలోని 140 కోట్ల మంది ప్రజల అవసరాలే భారత్ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన చోదకశక్తిగా ఉన్నాయని పేర్కొన్నారు. ఉత్పత్తుల రూపకల్పన నుంచి తుది తయారీ వరకు సమగ్ర విలువ ఆధారిత వ్యవస్థలను భారత్ అభివృద్ధి చేస్తోందన్నారు. భారత్ ఉత్పాదక సామర్థ్యం దేశీయ అవసరాలతోపాటు ప్రపంచ అవసరాలను కూడా తీర్చుతోందని చెప్పారు. జీ20 అధ్యక్ష దేశం గుర్తించిన రంగాల్లో భారత్‌కు నిర్మాణాత్మక అదనపు ఉత్పత్తి సామర్థ్యం లేదని స్పష్టం చేశారు.

**డంపింగ్‌పై డబ్ల్యూటీఓ నిబంధనల ప్రకారమే చర్యలు**

కొన్ని దేశాలు తమ పరిశ్రమలకు అందిస్తున్న వాణిజ్య వక్రీకరణ ప్రోత్సాహకాల కారణంగా డంపింగ్, దోపిడీ ధరల విధానం పెరుగుతోందన్న ఆందోళనలను భారత్ కూడా పంచుకుంటోందని మంత్రి తెలిపారు. ఇటువంటి సమస్యలను సాక్ష్యాధారాల ఆధారంగా, న్యాయ సమీక్షకు లోబడి యాంటీ డంపింగ్, కౌంటర్‌వైలింగ్ సుంకాల వంటి డబ్ల్యూటీఓ అనుమతించిన చర్యలతోనే పరిష్కరించాలని సూచించారు. పారిశ్రామిక సామర్థ్యం కలిగి ఉండటమే సమస్య కాదని, రహస్య రాయితీలు, ప్రభుత్వ మద్దతుతో ఉత్పత్తి కొన్ని ప్రాంతాల్లోనే కేంద్రీకృతమైనప్పుడు వక్రీకరణలు ఏర్పడతాయని చెప్పారు. ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను విస్తరించడం సముచితమైన లక్ష్యమే అయినప్పటికీ, డబ్ల్యూటీఓ నిబంధనలకు విరుద్ధమైన చర్యలకు దానిని సాకుగా చూపకూడదన్నారు. అభివృద్ధి చెందిన దేశాల సర్దుబాటు భారాన్ని వర్ధమాన దేశాలపై మోపకూడదని స్పష్టం చేశారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు వర్ధమాన దేశాలకు అవసరమైన విధానపరమైన స్వేచ్ఛను కొనసాగించాలని కోరారు.

**ఎంఎఫ్ఎన్ సూత్రాన్ని పరిరక్షించాలి**

జీ20 దేశాలతో భారత్ వాణిజ్యం పారదర్శకమైన, వివక్షరహితమైన, నిబంధనల ఆధారిత అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థపై ఆధారపడి ఉందని పీయూష్ గోయల్ తెలిపారు. చిన్న వ్యాపారితోపాటు అతిపెద్ద వ్యాపార సంస్థకూ సమాన నిబంధనలు వర్తించేలా చూడటంలో మోస్ట్ ఫేవర్డ్ నేషన్ విధానం కీలకమన్నారు. డబ్ల్యూటీఓ నిర్ణయాల్లో ఏకాభిప్రాయ విధానమే ప్రధానంగా కొనసాగాలని చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాలతో సమాన స్థాయికి చేరేందుకు వర్ధమాన దేశాలకు ప్రత్యేక, భిన్నమైన ప్రాధాన్య నిబంధనలను కొనసాగించాలన్నారు. రెండు అంచెల వివాద పరిష్కార వ్యవస్థను పునరుద్ధరించాలని కోరారు.

**వెట్టిచాకిరి నిర్మూలనకు సంపూర్ణ కట్టుబాటు**

అంతర్జాతీయ సరఫరా వ్యవస్థల్లో వెట్టిచాకిరిని నిర్మూలించేందుకు భారత్ సంపూర్ణంగా, బేషరతుగా కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 23 వెట్టిచాకిరిని నిషేధిస్తోందని, ఈ ప్రాథమిక హక్కును సుప్రీంకోర్టు ద్వారా అమలు చేయవచ్చని గుర్తుచేశారు. అంతర్జాతీయ కార్మిక సంస్థకు చెందిన 29, 105 ఒప్పందాలను భారత్ ఆమోదించిందన్నారు. వెట్టిచాకిరితో తయారైన వస్తువుల దిగుమతులను నిషేధిస్తూ 2026 జూలైలో విదేశీ వాణిజ్య విధానాన్ని సవరించినట్లు తెలిపారు.

సరిహద్దుల వద్ద తీసుకునే వాణిజ్య చర్యలు నిర్దిష్టమైన, ధ్రువీకరించగల ఆధారాలపైనే ఉండాలని స్పష్టం చేశారు. దేశాలు, ప్రాంతాలు లేదా పరిశ్రమలపై సాధారణ అనుమానాలతో చర్యలు తీసుకోకూడదన్నారు. న్యాయబద్ధమైన విచారణ ప్రక్రియతోపాటు డబ్ల్యూటీఓ నిబంధనలను తప్పనిసరిగా గౌరవించాలని సూచించారు.

కార్మిక ప్రమాణాలకు సంబంధించి అంతర్జాతీయ కార్మిక సంస్థే సమర్థమైన, సార్వత్రిక త్రైపాక్షిక సంస్థ అని పేర్కొన్నారు. వెట్టిచాకిరి నిర్మూలనకు సంబంధించిన ఉత్తమ విధానాలను జీ20 దేశాలు స్వచ్ఛందంగా పంచుకోవడానికి భారత్ మద్దతు ఇస్తుందని తెలిపారు. అయితే సభ్య దేశాలపై పర్యవేక్షణ, కొత్త బాధ్యతల విధింపు లేదా ఏకపక్ష వాణిజ్య చర్యలకు సమాచారాన్ని వినియోగించడం వంటి వాటికి అంగీకరించబోమన్నారు.

**వర్ధమాన దేశాల ప్రయోజనాలు కాపాడాలి**

డబ్ల్యూటీఓ కేంద్రంగా నిబంధనల ఆధారిత, న్యాయమైన, సమానమైన, వివక్షరహితమైన, పారదర్శకమైన, స్వేచ్ఛాయుతమైన, సమగ్ర బహుళపక్ష వాణిజ్య వ్యవస్థకు భారత్ కట్టుబడి ఉందని పీయూష్ గోయల్ పునరుద్ఘాటించారు. వర్ధమాన దేశాలు అభివృద్ధి చెందడానికి, తమ ప్రజల ఆహార అవసరాలను తీర్చడానికి అవసరమైన విధానపరమైన స్వేచ్ఛను పరిరక్షించాలని కోరారు.

సమావేశ ఏర్పాట్లు, ఆతిథ్యం అందించిన అమెరికా జీ20 అధ్యక్ష బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమష్టిగా పరిష్కరించలేని అంశాలు, పరిష్కరించగల అంశాలకు అడ్డంకిగా మారకూడదన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాటలను గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో భారత్ సమావేశంలో పాల్గొని నాలుగు ప్రధాన అంశాలపై నిర్మాణాత్మక సూచనలు చేసినట్లు చెప్పారు. 2027లో జీ20 అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్న యునైటెడ్ కింగ్‌డమ్‌కు భారత్ సంపూర్ణ సహకారం అందిస్తుందని ప్రకటించారు.

సమావేశం సందర్భంగా ఆస్ట్రేలియా, సౌదీ అరేబియా, ఫ్రాన్స్, దక్షిణ కొరియా, కెనడా దేశాల వాణిజ్య మంత్రులతో పీయూష్ గోయల్ ద్వైపాక్షిక చర్చలు నిర్వహించారు.

## ఐఐఏసీలో మొక్కలు నాటిన కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్

మొదటి పేజీ తరువాయి

శాసన విభాగం, న్యాయ వ్యవహారాల శాఖ కార్యదర్శి, ఐఐఏసీ చైర్‌పర్సన్ డాక్టర్ రాజీవ్ మణి, వివిధ విభాగాల ఉన్నతాధికారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా అర్జున్ రామ్ మేఘ్వాల్ మాట్లాడుతూ.. వీధులు, బహిరంగ ప్రదేశాలను శుభ్రంగా ఉంచడంతోనే పరిశుభ్రత పూర్తికాదని, స్వచ్ఛమైన మనసు, మంచి ఆలోచనలు, సమాజం పట్ల బాధ్యతతోనే నిజమైన పరిశుభ్రత ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 'స్వచ్ఛతా హీ సేవ' ప్రజా ఉద్యమమని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

మహాత్మా గాంధీ 1917లో చంపారన్‌లో చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాలను మంత్రి గుర్తుచేశారు. పరిశుభ్రత, క్రమశిక్షణ, సేవాభావం స్వతంత్ర, స్వావలంబన భారతదేశంపై గాంధీజీ దార్శనికతలో అంతర్భాగమని తెలిపారు. చంపారన్ ఉద్యమం మనకు నేర్పిన పాఠం నేటికీ ప్రాసంగికమని, స్వచ్ఛత అనేది కేవలం ప్రచారం మాత్రమే కాకుండా పరస్పర సహకారం, సమష్టి బాధ్యతతో కూడిన మహోన్నత లక్ష్యమని వివరించారు.

అందరి సమష్టి కృషితో ఐఐఏసీ ప్రపంచస్థాయి సమర్థవంతమైన, విశ్వసనీయ మధ్యవర్తిత్వ కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. పారదర్శకత, క్రమశిక్షణ, సేవాభావాన్ని ఈ సంస్థ ప్రతిబింబించాలని సూచించారు.

డాక్టర్ రాజీవ్ మణి మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత, మానసిక పరిశుభ్రత ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్నాయని పేర్కొన్నారు. సంస్థలు స్థిరమైన పర్యావరణ విధానాలను అవలంబిస్తూ స్వచ్ఛ భారత్ లక్ష్యాల సాధనకు తోడ్పడాలని కోరారు. అంతర్జాతీయ మధ్యవర్తిత్వానికి భారత్‌ను ప్రాధాన్య కేంద్రంగా తీర్చిదిద్దడంలో ఐఐఏసీ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

ఐఐఏసీ సీఈఓ నవీన్ కుమార్ సింగ్ అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన అభివృద్ధికి ఐఐఏసీ కట్టుబడి ఉందని వెల్లడించారు. పరిశుభ్రత కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ పచ్చదనం, స్థిరమైన పర్యావరణాన్ని ప్రోత్సహిస్తామని ప్రతిజ్ఞ చేయడంతో కార్యక్రమం ముగిసింది.

## 40 ఏళ్లుగా మరసం కొనసాగడం కవుల నిబద్ధతకు నిదర్శనం

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ఉద్యమంలో దేశపతి శ్రీనివాస్, దేవి ప్రసాద్ వంటి వారు కీలకంగా పనిచేశారని హరీశ్‌రావు గుర్తుచేశారు. సకల జనుల సమ్మె వెనుక దేవి ప్రసాద్ వ్యూహం, ప్రధాన కార్యదర్శిగా ఆయన పోషించిన పాత్ర ముఖ్యమైనదన్నారు.

మంజీరాను జీవనదిగా మార్చాం

ఉమ్మడి రాష్ట్రంలో మంజీరా నదిపై నీటిని వినియోగించుకునేందుకు అనేక ఆంక్షలు ఉండేవని హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం మంజీరాపై అనేక చెక్‌డ్యాంలు నిర్మించడంతో మెదక్ జిల్లాకు సాగునీటి ప్రయోజనం కలిగిందని పేర్కొన్నారు.

తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం సాహిత్య అకాడమీని పునరుద్ధరించి, నందిని సిద్ధారెడ్డిని తొలి చైర్మన్‌గా నియమించిందని హరీశ్‌రావు తెలిపారు. ప్రపంచ తెలుగు మహాసభలను ఘనంగా నిర్వహించామని చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సాహిత్య అకాడమీకి చైర్మన్‌ను నియమించలేదని ఆయన విమర్శించారు.

తెలంగాణ రాష్ట్ర పండుగలుగా బతుకమ్మ, బోనాలకు గుర్తింపు లభించిందని, జయశంకర్, సర్వాయి పాపన్న, దొడ్డి కొమురయ్య వంటి మహనీయులకు తగిన గౌరవం దక్కిందని అన్నారు. సుమారు 550 మంది కళాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

పుస్తక పఠనాన్ని పెంచాలి

డిజిటల్ యుగంలో పిల్లల్లో పుస్తక పఠనం తగ్గిపోతోందని హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, ప్రభుత్వాలు పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా కవితలు, పుస్తకాలు రూపొందించే పరిస్థితి వచ్చినప్పటికీ.. కవి తన అనుభవం, భావోద్వేగాలతో గుండెల్లోంచి రాసే సాహిత్యానికి ఉన్న జీవత్వం, నిజాయితీకి ఏఐ ప్రత్యామ్నాయం కాదన్నారు.

రాబోయే తరాలకు తెలంగాణ ఉద్యమం, ప్రజా పోరాటాల చరిత్రను అందించడంలో పుస్తకాలు కీలకమని, సామాజిక అణిచివేతకు వ్యతిరేకంగా కవిత, పాటలు ఆయుధాలుగా పనిచేస్తాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. సాహిత్యాన్ని, కవులను ప్రోత్సహించడం అందరి బాధ్యత అని అన్నారు. మంజీరా రచయితల సంఘం అధ్యక్షుడు కే. రంగాచారి అధ్యక్షతన జరిగిన సభలో తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవి ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె. విరాహత్ అలీ, ప్రముఖ కవి, రచయిత నాలేశ్వరం శంకరం, ప్రముఖ జర్నలిస్టు కే. అంజయ్య, ప్రముఖ కవి అల్లాజిపూర్ కిషన్, ఎన్. భగవాన్ రెడ్డి, జి. తిరుపతిరెడ్డి, తోట అశోక్ తదితర కవులు, రచయితలు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజా రవాణాలో డిజిటల్ విప్లవం

మొదటి పేజీ తరువాయి

ప్రజా రవాణా వ్యవస్థను మరింత ఆధునికంగా, సమగ్రంగా, ప్రయాణికులకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది., టీజీఎస్ఆర్టీసీ, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ సంయుక్తంగా ఆర్టీసీ - మెట్రో కామన్ పాస్, 'వీవమఋషెవ్' మొబైల్ యాప్, డిజిటల్ వీక్లీ బస్ పాస్లను అందుబాటులోకి తీసుకొచ్చాయి. హైదరాబాద్ ప్రజాభవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కామన్ పాస్, వీవమఋషెవ్ యాప్, డిజిటల్ వీక్లీ బస్ పాస్‌లను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులు వివేక్ వెంకటస్వామి, మహమ్మద్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే పాస్‌తో ఆర్టీసీ -మెట్రో ప్రయాణం

హైదరాబాద్‌లో ప్రతిరోజూ భారీ సంఖ్యలో ప్రజలు ఆర్టీసీ బస్సులు, మెట్రో రైళ్లను వినియోగిస్తున్న నేపథ్యంలో రెండు ప్రజా రవాణా వ్యవస్థలను అనుసంధానం చేస్తూ కామన్ పాస్‌ను ప్రవేశపెట్టారు. ఈ పాస్‌తో ఓఆర్ఆర్ పరిధిలో నడిచే టీజీఎస్ఆర్టీసీ సిటీ బస్సుల్లో (పుష్పక్ మినహా), మెట్రో రైళ్లలో ప్రయాణించవచ్చు. కామన్ పాస్‌లు అన్ని మెట్రో స్టేషన్లలో అందుబాటులో ఉంటాయి. మొదటిసారి కార్డు తీసుకునేటప్పుడు రూ.100 డిపాజిట్ చెల్లించాలి. కార్డును తిరిగి అప్పగించినప్పుడు ఆ మొత్తాన్ని రీఫండ్ చేస్తారు.

కామన్ పాస్ ధరలు:

- రోజువారీ పాస్ - రూ.400
- మెట్రో - రూ.300
- ఆర్టీసీ - రూ.100
- నెలవారీ పాస్ - రూ. 8,500
- మెట్రో - రూ.7,000
- ఆర్టీసీ - రూ.1,500

ఈ కామన్ పాస్ ద్వారా మెట్రో స్టేషన్ల నుంచి నివాస, వాణిజ్య ప్రాంతాలకు లాస్ట్ మైల్ కనెక్టివిటీ మరింత సులభతరం కానుంది. ప్రజా రవాణా వినియోగం పెరగడం ద్వారా ట్రాఫిక్ రద్దీ, వాహన కాలుష్యం తగ్గించేందుకు కూడా ఇది దోహదపడుతుంది.

వీవమఋషెవ్' యాప్‌తో డిజిటల్ ప్రయాణం

సిటీ బస్సు ప్రయాణికుల కోసం టీజీఎస్ఆర్టీసీ 'వీవమఋషెవ్' మొబైల్ యాప్ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

- మొబైల్‌లోనే బస్ టికెట్లు కొనుగోలు చేయవచ్చు
- బోర్డింగ్ పాయింట్, గమ్యస్థానాన్ని ఎంచుకోవచ్చు
- ఆన్‌లైన్‌లో చెల్లింపు చేయవచ్చు.
- డైనమిక్ ా= కోడ్‌తో డిజిటల్ టికెట్ పొందవచ్చు
- రోజువారీ, వారపు, నెలవారీ పాస్‌లను పొందవచ్చు.
- ?దీంతో కాగితపు టికెట్ల అవసరం తగ్గడంతో పాటు నగదు, చిల్లర సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ప్రయాణికుల సమయం కూడా ఆదా అవుతుంది.

రూ.600తో డిజిటల్ వీక్లీ బస్ పాస్

రోజువారీ ప్రయాణికుల సౌకర్యార్థం రూ.600తో డిజిటల్ వీక్లీ బస్ పాస్ను ప్రారంభించారు. వీవమఋషెవ్ యాప్ ద్వారా ఈ పాస్‌ను కొనుగోలు చేసుకోవచ్చు. డైనమిక్ా= కోడ్‌తో కూడిన పాస్‌ను బస్సులో సులభంగా వినియోగించుకోవచ్చు. పాస్ గడువు పూర్తయిన తర్వాత యాప్ ద్వారానే రెన్యూవల్ చేసుకునే సదుపాయం కల్పించారు.

మంత్రులతో కలిసి కామన్ పాస్ ప్రయాణం

కామన్ పాస్ విధానాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వయంగా రాష్ట్ర మంత్రుల కోసం వన్‌డే కామన్ పాస్‌లను కొనుగోలు చేశారు. శనివారం ఉదయం 10 గంటలకు బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి కామన్ పాస్‌తో మెట్రోలో ప్రయాణించి, అనంతరం ఆర్టీసీ బస్సులో ప్రయాణించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

ఆటో రిక్షా చార్జీల సవరణ

ప్రజా రవాణా వ్యవస్థలో ఆర్టీసీ, మెట్రోతో పాటు ఆటో రంగాన్ని కూడా కీలక భాగస్వామిగా గుర్తిస్తూ ప్రభుత్వం 12 ఏళ్లుగా తర్వాత ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఆటో రిక్షా చార్జీలను సవరించింది. గతంలో 14.02.2014న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన +.ా.వీం.చీశీ.20 ప్రకారం అమల్లో ఉన్న చార్జీలను తాజాగా సవరించారు.

సవరించిన ఆటో చార్జీలు

- మొదటి 1.6 కిలోమీటర్లకు కనీస చార్జీ: రూ.30
- ప్రతి తదుపరి కిలోమీటర్‌కు: రూ.14
- నిరీక్షణ చార్జీ: నిమిషానికి రూ.0.75
- అర్హత కలిగిన సామాను ప్యాకేజీ చార్జీ: రూ.0.50
- గరిష్ఠ సామాను పరిమితి: 100 కిలోలు
- రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు సాధారణ చార్జీకి 1.5 రెట్లు

ఆటో డ్రైవర్ల జీవనోపాధి, పెరిగిన నిర్వహణ వ్యయాలు, ప్రయాణికుల ప్రయోజనాలను సమతుల్యం చేస్తూ ఈ చార్జీల సవరణ చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది.

**ఆటో కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు**

ఆటో డ్రైవర్లు ప్రజా రవాణా వ్యవస్థలో కీలక భాగస్వాములని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆటో డ్రైవర్ల సమస్యలు, జీవనోపాధి, సంక్షేమాన్ని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకుంటుందని చెప్పారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తామని వెల్లడించారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమంతో పాటు ఆటో కార్మికుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలిలి

ఆర్టీసీకి ప్రస్తుతం నెలకు రూ.300 కోట్లు విడుదల చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అదనంగా మరో రూ.50 కోట్లు కలిపి నెలకు మొత్తం రూ.350 కోట్లు విడుదల చేసి, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరారు. ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తూ మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్నామని, ఈ పథకం ద్వారా ఆర్టీసీపై పెరిగిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందిని అభినందించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి హైదరాబాద్ వరకు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతం అయితే ట్రాఫిక్ రద్దీ, వాహన కాలుష్యం తగ్గుతాయని తెలిపారు. ఫస్ట్ మైల్ - లాస్ట్ మైల్ కనెక్టివిటీపై ప్రత్యేక దృష్టి

ప్రజా దివాస్ తెలుగు దినపత్రిక
03-10-2026

# మహాత్మా గాంధీజీ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం: జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

**- జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా మహాత్మా గాంధీజీ జయంతి వేడుకలు**





రాజన్న సిరిసిల్ల జిల్లా / అక్టోబర్ 02 (ప్రజాదివాస్)
జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీజీ చిత్రపటానికి జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీజీ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. నేటి యువత గాంధీజీ చూపిన సత్యం, అహింస మార్గాలను అనుసరిస్తూ ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని సూచించారు. గాంధీజీ నమ్మిన సిద్ధాంతాలు, విలువలను నిబద్ధతతో ఆచరించడం వల్లే ఆయన కీర్తి, ప్రతిష్టలు ప్రపంచవ్యాప్తంగా చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్ఐలు సురేష్, రమేష్, సీఐలు మొగిలి, మధుకర్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బద్ది పోచమ్మ ఆలయాభివృద్ధికి రూ. 20 కోట్ల సఫ్ట్ లోన్ మంజూరు

**- భూసేకరణ ప్రక్రియ వేగవంతం.. యాడా ఖాతాకు రూ. 20 కోట్ల నిధుల బదిలీ**




**- రాజరాజేశ్వర దేవస్థానం నిధులతో బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ పనులు**

వేములవాడ / అక్టోబర్ 02 (ప్రజాదివాస్)
రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం నిధుల నుంచి శ్రీ బద్ది పోచమ్మ ఆలయ స్థల సేకరణ మరియు ఆలయ పరిసరాల అభివృద్ధికై వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (యాడా) ఖాతాకు రూ. 20 కోట్ల నిధులను సఫ్ట్ లోన్ (రాయితీ రుణం) ప్రాతిపదికన విడుదల చేశారు. ఈ మేరకు ఆలయ ఈవో మరియు డిప్యూటీ కమిషనర్ డి.కృష్ణప్రసాద్ సంబంధిత నిధుల చెక్కును వైస్ చైర్మన్ ఓ సీఈవో పేరిట జారీ చేశారు. వేములవాడ బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ, ల్యాండ్ అక్విజిషన్ (స్థల సేకరణ) మరియు ఆలయ పరిసర ప్రాంతాల అభివృద్ధి పనుల నిమిత్తం టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీకి నిధులు కేటాయించాలని గతంలో ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ ఉత్తర్వులు మరియు దేవాదాయ శాఖ కమిషనర్ అనుమతుల మేరకు దేవస్థానానికి చెందిన ఫిక్స్ డిపాజిట్ల (ఖీణ=౦) నుండి ఈ రూ. 20 కోట్ల నిధులను సఫ్ట్ లోన్ కింద విడతాడు బదిలీ చేసినట్లు అధికారిక లేఖలో పేర్కొన్నారు. ఈ నిధుల సహాయంతో బద్ది పోచమ్మ ఆలయ పరిసరాల్లో భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, ఆలయాభివృద్ధి పనులను చేపట్టనున్నారు. పనులు పూర్తయిన తర్వాత లేదా నిర్ణీత గడువులోగా ఈ రుణ మొత్తాన్ని తిరిగి దేవస్థానానికి చెల్లించాల్సిందిగా అధికారులను కోరారు.

# గాంధీ, శాస్త్రీజీల ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ పునరంకితం కావాలి: మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

**- మున్సిపాలిటీలో కన్నులపండువగా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతులు**
**- సత్యం, అహింసలే మానవాళికి శరణ్యం: మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**
**- 'జై జవాన్ - జై కిసాన్' నినాదంతో దేశంలో స్ఫూర్తి నింపిన మహనీయుడు శాస్త్రీజీ**






వేములవాడ / అక్టోబర్ 02 (ప్రజాదివాస్)
వేములవాడ స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతుల వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి విగ్రహాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ ప్రబోధించిన సత్యం, అహింసా సిద్ధాంతాలు ప్రపంచానికే నిత్య ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో గాంధీజీ చేసిన అసమాన త్యాగాలు, ఆయన అందించిన దేశ సేవ ప్రతీ ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా గాంధీజీ నడిపిన సుదీర్ఘ పోరాటం భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో అత్యంత కీలక ఘట్టంగా నిలిచిందని చెప్పారు. సత్యం, అహింస, సత్యాగ్రహాలను ఆయుధాలుగా చేసుకొని స్వాతంత్ర్య పోరాటాన్ని ఒక మహా ప్రజా ఉద్యమంగా మలిచిన ఘనత గాంధీజీకే దక్కుతుందన్నారు. ప్రజలు, ముఖ్యంగా నేటి యువత గాంధీజీ చూపిన సత్యం, అహింసల మార్గంలో నడుస్తూ దేశ ఐక్యతను, జాతి సమగ్రతను కాపాడుకోవాలని, అదే మనం ఆ మహనీయుడికి ఇచ్చే అత్యున్నతమైన నివాళి అని పిలుపునిచ్చారు. అదేవిధంగా భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానిని కూడా పూలమాల వేసి చైర్మన్ పుల్కం రాజు అంజలి ఘటించారు. దేశ రెండవ ప్రధానిగా శాస్త్రీజీ అందించిన సేవలు, దేశ సమగ్ర అభివృద్ధికి మరియు రైతుల సంక్షేమానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. 'జై జవాన్ - జై కిసాన్' అనే శక్తివంతమైన నినాదంతో దేశప్రజల్లో నూతనోత్తేజాన్ని, దేశభక్తి స్ఫూర్తిని నింపిన మహనీయుడు లాల్ బహదూర్ శాస్త్రి అని స్మరించుకున్నారు. 1965 భారత్ - పాకిస్తాన్ యుద్ధ సమయంలో దేశానికి అత్యంత ధైర్యంగా, సమర్థవంతంగా నాయకత్వం వహించి, సరిహద్దు రక్షణను పటిష్టం చేయడంలో అనేక విప్లవాత్మక సంస్కరణలు చేపట్టారని గుర్తుచేశారు. స్వాతంత్ర్య సమరయోధులు, పోరాట యోధులు దేశం కోసం చేసిన సేవలను, వారి త్యాగాలను గుర్తించి గౌరవించాల్సిన ప్రాథమిక బాధ్యత ప్రజలపై, యువతపై మరియు సమాజంలోని ప్రతీ ఒక్కరిపైనా ఉందని స్పష్టం చేశారు. ఈ వేడుకల్లో మున్సిపల్ కమిషనర్ లోకేష్, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి : మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి

**- సిరిసిల్లలో ఘనంగా 'స్వచ్ఛత హి సేవ-2026'.. మున్సిపల్ కార్మికులకు ఆత్మీయ సన్మానం**
**- గాంధీజీ జయంతి వేళ సఫాయి మిత్రలకు వైద్య పరీక్షలు.. స్వయంగా పాల్గొన్న చైర్‌పర్సన్**







రాజన్న సిరిసిల్ల జిల్లా / అక్టోబర్ 02 (ప్రజాదివాస్)
సిరిసిల్ల స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని 'స్వచ్ఛత హి సేవ-2026', 'సఫాయి మిత్ర సురక్ష ఏవం సన్మాన శిబిరం' కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహపూరితంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమంలో పాల్గొని, మున్సిపల్ పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి మాట్లాడుతూ.. బాపూజీ కలలు కని ప్రబోధించిన స్వచ్ఛ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో మున్సిపల్ కార్మికులు ముందుండి పోరాడుతున్నారని, వారి సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. సమాజంలో ప్రతి ఒక్కరూ పారిశుధ్య కార్మికుల సేవలను గౌరవించాలని కోరారు. మహాత్మా గాంధీ జయంతి రోజున కార్మికులకు అందిస్తున్న సేవలను గుర్తిస్తూ వారిని సన్మానించుకోవడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. నిత్యం ప్రజల ఆరోగ్యం కోసం శ్రమించే కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఎల్లారెడ్డిపేట అశ్విని హాస్పిటల్స్ సహకారంతో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ శిబిరంలో నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించి, తగిన సలహాలతో పాటు ఉచితంగా మందులు అందజేస్తారని, కార్మికులు, ఉద్యోగులు, సిబ్బంది ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్మికుల్లో నమ్మకాన్ని నింపేందుకు చైర్‌పర్సన్ స్వయంగా వైద్య పరీక్షలు చేయించుకోవడం విశేషం. అనంతరం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన అశ్విని హాస్పిటల్ యాజమాన్యానికి, వైద్య బృందానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎండీ ఖదీర్ పాషా మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులు, మున్సిపల్ సిబ్బంది తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఉచిత వైద్య శిబిర సేవలనందరినీ పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ విప్ బుర్ర మల్లికార్జున్, కౌన్సిలర్లు వేముల రాములు, దూడం రజని శ్రీనివాస్, ఎర్రం వెంకట్రామ్యం, మామిడాల మహేష్, బుర్ర నారాయణ గౌడ్, కూర భాగ్యలక్ష్మి దేవరాజ్, మెరుగు మంజుల శ్రీనివాస్, బొద్దుల శ్రీనివాస్, ఎలుక వెంకటేశం, లింగంపల్లి గంగరాజు, ఆడెపు చంద్రకళ ప్రభాకర్, అడిచెర్ల రూప సాయి కృష్ణ, గెంట్యాల శ్యామల శ్రీనివాస్, పాషికంటి రమ్య సత్యనారాయణ, కొండ వర్షిని నరేష్, బత్తుల రమేష్, రిక్కుమల్లె రజిత సంపత్, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సోహెల్, మున్సిపల్ అధికారులు, పుర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని పారిశుధ్య కార్మికులను సన్మానించారు.

# గాంధీజీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**





రాజన్న సిరిసిల్ల జిల్లా / అక్టోబర్ 02 (ప్రజాదివాస్)
గాంధీజీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.. శుక్రవారం జాతిపిత మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహాలకు పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు దేశానికి అందించిన సేవలను, స్వాతంత్ర్య పోరాటంలో పోషించిన కీలక పాత్రను స్మరించుకున్నారు.. అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో మహాత్మా గాంధీ చేసిన పోరాటం చిరస్మరణీయమని అన్నారు. బ్రిటిష్ పాలకుల అణచివేతకు వ్యతిరేకంగా అహింస, శాంతియుత మార్గాలను అనుసరిస్తూ దేశ ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఉప్పు సత్యాగ్రహం, విదేశీ వస్త్రాల బహిష్కరణ, క్విట్ ఇండియా ఉద్యమం వంటి పోరాటాల ద్వారా స్వాతంత్ర్య ఉద్యమానికి నూతన ఉత్తేజాన్ని అందించారని గుర్తుచేశారు. గాంధీజీ జీవితం, ఆయన అనుసరించిన సత్యం, అహింస, శాంతి మార్గాలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజంలో శాంతి, ఐక్యత, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీ చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, మహనీయులు చూపిన మార్గంలో పయనిస్తూ వారి ఆశయాల సాధనకు కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు..

TGTEL/25/A0827 ప్రజా దివాస్ తెలుగు దినపత్రిక


# వేములవాడలో 'రాజన్న ప్రసాదం' కోడె మృతి.. ఆవేదనలో బాధిత రైతు

- ఫోన్ చేసినా పట్టించుకోని పశు వైద్యాధికారి..
- సమయానికి వైద్యం అందకే కోడె మృతి చెందిందని రైతు నర్సయ్య ఆరోపణ
- వైద్యాధికారిపై చర్యలు తీసుకుని, మరో రాజన్న కోడెను అందించి ఆదుకోవాలి
- అయ్యోరుపల్లి వార్డు ప్రజల విజ్ఞప్తి..

వేములవాడ / అక్టోబర్ 02 (ప్రజాదివాస్)
దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తులు మొక్కుబడిగా సమర్పించిన కోడెలను 'రాజన్న ప్రసాదం' పేరిట ఉచితంగా రైతులకు పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు అయ్యోరుపల్లి గ్రామానికి చెందిన రైతు నర్సయ్యకు గత రెండు సంవత్సరాల క్రితం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రెండు రాజన్న కోడెలను అందజేశారు. ఆ కోడెలు వ్యవసాయ పనుల్లో రైతుకు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయి. కాగా, గత రెండు రోజులుగా అందులో ఒక కోడె తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. అనారోగ్యానికి గురైన కోడెకు వైద్యం అందించాలని రైతు నర్సయ్య స్థానిక పశు వైద్యాధికారికి ఎన్నిసార్లు ఫోన్ చేసి వేడుకున్నా ఆయన ఏమాత్రం స్పందించలేదని బాధిత రైతు ఆరోపించారు.వైద్యుని నిర్లక్ష్యం కారణంగా సరైన సమయంలో వైద్యం అందక ఆ కోడె శుక్రవారం మృతి చెందిందని రైతు కన్నీరుమున్నీరయ్యారు. సకాలంలో స్పందించకుండా కోడె మృతికి కారణమైన పశు వైద్యాధికారిపై ఉన్నతాధికారులు తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని రైతు నర్సయ్య డిమాండ్



చేశారు. అంతేకాకుండా, కోడె మృతితో తీవ్రంగా నష్టపోయిన పేద రైతుకు ప్రభుత్వం మరియు ఆలయ అధికారులు స్పందించి మరొక రాజన్న కోడెను ఉచితంగా అందజేసి ఆదుకోవాలని అయ్యోరుపల్లి గ్రామ రైతులు, స్థానికులు కోరారు.

# ఆరుగురు మంత్రులు ఉన్నా ఎందుకింత దుర్భర స్థితి

- అందరూ హేమాహేమీలే అయినా ఎందుకీ పరిస్థితి.

ప్రజాదివాస్
గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి నల్లగొండ-ఖమ్మం-వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించిన రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు



విముఖత చూపించడం జరిగింది. ఆయనకు ఎమ్మెల్సీ సీటు వద్దు అని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయాలని ఆశిస్తున్నట్లు సమాచారం.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ టికెట్ కోసం తాను ఎవరినీ సంప్రదించలేదని, తనతో ముందస్తుగా మాట్లాడకుండానే అభ్యర్థిగా పేరు ప్రకటించడంపై ఆయన ఆశ్చర్యం, అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.ఈ విషయమై ఆయన పార్టీకి చెందిన పలువురు ముఖ్య నేతలను, మంత్రులను కలిసి తన అభిప్రాయాన్ని, సూర్యాపేట ఎమ్మెల్యే టికెట్ ఆకాంక్షను తెలియజేస్తున్నారు. ఒకసారి అభ్యర్థిని ప్రకటించాక మార్చడం పార్టీకి సరైన సంకేతం కాదని, అభ్యర్థి మార్పు కుదరదని పార్టీ స్పష్టం చేస్తోంది. సర్వోత్తమ్ రెడ్డిని బుజ్జగించి పోటీ బరిలో ఉంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం.

# ఘనంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు

ముస్తాబాద్/ అక్టోబర్ 2 ప్రజా దివాస్
మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ముస్తాబాద్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గజ్జెల రాజు మాట్లాడుతూ,మహాత్మా గాంధీ సత్యం,అహింస, శాంతి, సామాజిక సమానత్వం వంటి విలువలకు కట్టుబడి దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించారని అన్నారు.గాంధీజీ చూపిన మార్గం కాంగ్రెస్ పార్టీకి ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలిచిందని పేర్కొన్నారు.ప్రజాస్వామ్యం, లౌకికవాదం,సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజల హక్కుల పరిరక్షణ వంటి విలువలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి



చేస్తోందని గజ్జెల రాజు అన్నారు. గాంధీజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఏళ్ళ బాల్ రెడ్డి మాట్లాడుతూ, మహాత్మా గాంధీ భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించడమే కాకుండా,సమాజంలో శాంతి, సోదరభావం, సమానత్వం నెలకొల్పేందుకు కృషి చేశారని అన్నారు గాంధీజీ ఆలోచనలు మరియు ఆశయాలు కాంగ్రెస్ పార్టీ చారిత్రక ప్రస్థానంలో ముఖ్యమైన భాగమని పేర్కొన్నారు సత్యం, అహింస, ప్రజాస్వామ్యం, పేదలు మరియు బలహీన వర్గాల సంక్షేమం వంటి గాంధీజీ విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఏళ్ళ బాల్ రెడ్డి పిలుపు నిచ్చారు. గాంధీజీ చూపిన మార్గంలో నడుస్తూ దేశ సమైక్యత, సామాజిక సామరస్యం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,యువజన నాయకులు ఎన్ ఎస్ యు ఐ నాయకులు అభిమానులు మరియు స్థానిక ప్రజలు పాల్గొని మహాత్మా గాంధీకి ఘనంగా నివాళులర్పించారు

# గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నేచర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, రైల్వే సాధన సమితి జేఏసీ మెంబర్ సట్టు నాగయ్య

ప్రజాదివాస్



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ రావాలని గాంధీ జయంతి రోజు ఉదయం మౌన దీక్ష చేయడం జరిగింది. మౌన దీక్ష అనంతరం గాంధీ విగ్రహానికి పూలదండ వేసి ఘనంగా నివాళులర్పిస్తూ సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ కావాలని గాంధీ విగ్రహానికి బుల్లెట్ ట్రైన్ కారిడార్ సాధన సమితి జేఏసీ నాయకులు, నేచర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు సట్టు నాగయ్య వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ అహింస సిద్ధాంతంతో దేన్నైనా జయించొచ్చని శాంతియుత మార్గంలో స్వాతంత్రాన్ని సాధించారని తెలియజేస్తూ... సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ రావాలని మేము కూడా గాంధీ మార్గంలో శాంతియుతంగా ఉద్యమాలు చేస్తున్నామని, మా యొక్క ఉద్యమాన్ని, మా ఆకాంక్షను గుర్తించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మా ఆకాంక్షను నెరవేర్చకపోతే రేపు జరగబోయే ఎమ్మెల్సీ ఎలక్షన్లో మా సత్తా ఏంటో చూపిస్తామని అన్నారు.

# తెలంగాణ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం.. క్రీడాకారులకు పూల మొక్కలతో స్వాగతం

- తొలిసారిగా మ్యాట్‌పై కబడ్డీ సమరం.. క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపిన విప్ ఆది శ్రీనివాస్, చైర్మన్ పుల్కం రాజు

వేములవాడ / అక్టోబర్ 02 (ప్రజాదివాస్)
వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం సాయంత్రం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, జిల్లా కబడ్డీ కమిటీ ప్రతినిధులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పూల మొక్కలు అందించి ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా టోర్నమెంట్‌లో పాల్గొంటున్న జట్లకు, క్రీడాకారులకు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అభినందనలు తెలపడంతో పాటు శుభాకాంక్షలు అందించారు. క్రీడాకారుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ, వారి సౌకర్యార్థం వేములవాడ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా పీవీసీ (గ్రాంజ) / ఫోమ్ మ్యాట్‌పై ఈ కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మైదానంలో ఆటగాళ్లు ప్రమాదవశాత్తు కింద పడినప్పుడు తీవ్ర గాయాలు కాకుండా నివారించడానికి, సురక్షితమైన వాతావరణంలో పోటీలు సాగేందుకు ఈ మ్యాట్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదల మరియు జట్టు సమన్వయంతో ఉత్సాహంగా ఆడి తమ



ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, నిర్వాహకులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు..

ప్రజాదివాస్
మెదక్ జిల్లా నిజాంపేట మండలంలోని కె.వెంకటాపూర్ గ్రామంలో శు క్రవారం మహాత్మా గాంధీ జయంతి వేడుకలను గ్రామ సర్పంచ్ ముత్యాల సరిత--మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముత్యాల సరిత--మధుసూదన్ రెడ్డి మహాత్మా గాంధీ



విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అహింస, సత్యం మార్గాల్లో పోరాడిన మహనీయుడు మహాత్మా గాంధీ అని కొనియాడారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని, గ్రామ అభివృద్ధికి ప్రజలందరూ ఐకమత్యంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముత్యాల సత్యనారాయణ రెడ్డి, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ప్రేమలత, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# వెల్జిపురంలో ప్రత్యేక గ్రామసభ

- ఎదీ-+ =ూవీ-+ పనుల ప్రణాళికకు గ్రామసభ ఆమోదం
- గ్రామాభివృద్ధి పనుల గుర్తింపు వచ్చే ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేయాలని లక్ష్యం



ఇల్లంతాకుంట మండలం / అక్టోబర్ 2 (ప్రజాదివాస్)
గాంధీ జయంతి సందర్భంగా వెల్జిపురం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఎదీ-+ =ూవీ-+ (ఉపాధి హామీ) పనుల గుర్తింపు, ప్రణాళిక రూపకల్పన కోసం ప్రత్యేక గ్రామసభను సర్పంచ్ నాయిని నవీన్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు.సభ ప్రారంభంలో మహాత్మా గాంధీజీ దేశానికి అందించిన సేవలు, త్యాగాలను స్మరించుకుంటూ ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఎదీ-+ =ూవీ-+ పథకం ద్వారా గ్రామ ప్రజలకు లభించే ఉపాధి అవకాశాలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, గ్రామ అవసరాలపై విస్తృతంగా చర్చించారు.గ్రామ ప్రజల సూచనల మేరకు వ్యవసాయానికి ఉపయోగపడే పనులతో పాటు గ్రామ మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన పలు పనులను ఎదీ-+ =ూవీ-+ ప్రణాళికలో చేర్చాలని గ్రామసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. గుర్తించిన పనులను ప్రాధాన్యత క్రమంలో అమలు చేసి వచ్చే ఆర్థిక సంవత్సరంలోగా పూర్తి చేయాలని నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కంకణాల శ్రావణి నరేష్ రెడ్డి, ూ్రూజూ డైరెక్టర్ గుండా వెంకటేశం, వార్డు సభ్యులు గొల్లకమటి మల్లవ్వ శంకరయ్య, బొజ్జ శ్రీనివాస్, సంగెం ముత్తవ్వ, దేశెట్టి కవిత-బాబు చందర్, వెలిచాల భారతి-శ్రీనివాస్, బొల్లారం ప్రసన్న కుమార్, పంచాయతీ కార్యదర్శి రంజిత్ కుమార్, అంగన్వాడీ టీచర్లు జింక మంజుల, గోలి లక్ష్మి, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఎస్సీ కమిషన్ చైర్మన్ నియామకంలో రొటేషన్ పాటించాలి.

**- మాదిగ,అనుబంధ కులాల జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇవ్వాలి: టీఎంజేఫ్**



ప్రజాదివాస్

తెలంగాణ ఎస్సీ-ఎస్టీ కమిషన్ ప్రస్తుత పదవీకాలం అక్టోబర్ 3, 2026తో ముగియనున్న నేపథ్యంలో తదుపరి కమిషన్ చైర్మన్ నియామకంలో రొటేషన్ విధానాన్ని పాటించాలని తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం (టీఎంజేఎఫ్) ప్రభుత్వాన్ని కోరింది. మాదిగ,అనుబంధ కులాల జర్నలిస్టులకు కమిషన్‌లో ప్రాధాన్యత కల్పించాలని ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు భూర్గుల నాగేందర్ మాదిగ, గౌరవ అధ్యక్షులు వత్తుల రఘుపతి మాదిగ, ప్రధాన కార్యదర్శి బొల్లెపాక రాజేష్ మాదిగ డిమాండ్ చేశారు.ఈ మేరకు వారు గురువారం హైదర్ గూడ లోని ఎన్ ఎస్ ఎస్ మీడియా సెంటర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వారు మాట్లాడారు.ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లిన ముఖ్యమంత్రి,మంత్రిమండలి, కృషి చేసిన ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.గతంలో కమిషన్‌కు కల్పించిన ప్రాతినిధ్యాన్ని సమీక్షించి, ఒకే ఉపకులం లేదా ప్రాంతానికే పరిమితం కాకుండా మాదిగ, మాలలతో పాటు అన్ని ఎస్సీ కులాలు, ప్రాంతాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.కమిషన్ నియామకంలో మాదిగ,అనుబంధ కులాల జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో అనుభవం ఉన్న జర్నలిస్టులను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.కుల అణచివేత, కుల వివక్ష నిర్మూలనపై దూరదృష్టి,సామాజిక సమస్యలపై అవగాహన ఉన్నవారికి కమిషన్‌లో అవకాశం కల్పించాలని అన్నారు.కుల వివక్ష, కుల బహిష్కరణ,సామాజిక వెలివేత,గ్రామస్థాయి ఘర్షణలు ముదిరిన తర్వాత స్పందించకుండా,ముందుగానే సమస్యలను గుర్తించి నివారించే కార్యాచరణ ఉండాలని కోరారు.ముఖ్యంగా ఎస్సీ--బీసీ కులాల మధ్య ఘర్షణలకు దారితీసే సమస్యలను సంభాషణ, అవగాహన,చట్టపరమైన చర్యల ద్వారా పరిష్కరించే విధంగా కమిషన్ పనిచేయాలని



అన్నారు.ఈ సమావేశం లో రాష్ట్ర గౌరవ సలహా దారులు మైలారపు ప్రేమ్,సుంచు లింగయ్య, పసుల తిరుపతి, జిలకర కృష్ణాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కడియం నాగయ్య,దుబ్బ నగేష్, కార్యదర్శులు చెల్మెడ్ అనీల్,గంట వెంకన్న,మహంకాళి భిక్ష పతి, ప్రచార కార్యదర్శులు. కమ్మ కోల్ యాదయ్య, చింత ప్రవీణ్,కోశాధికారి బొట్ల సదానందం, అధికార ప్రతినిధి పంగిడిచెరువు వెంకటేష్, సహాయ కార్యదర్శి కాడేపగ శ్రీనివాస్, నాయకులు బొల్లె రాజయ్య, దరువుల శంకర్, మీసాల సైదులు, లంక స్వామి, రాయుడు, బాలకృష్ణ, రామస్వామి, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలు వేసి నివాళులర్పించిన జగ్గయ్యపేట వైఎస్ఆర్సిపి నాయకులు

ప్రజాదివాస్




జగ్గయ్యపేట మున్సిపాలిటీలోని మహాత్మా గాంధీ విగ్రహానికి మున్సిపల్ కౌన్సిలర్ పట్టణ వైఎస్ఆర్సిపి మాజీ అధ్యక్షులు వట్టేం మనోహర్ రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కార్యదర్శి చౌడవరపు జగదీష్ రాష్ట్ర వైఎస్ఆర్సిపి ఎస్టీ సెల్ విభాగం ప్రధాన కార్యదర్శి లాహోరి బద్దు నాయక్ జగ్గయ్యపేట పట్టణ మాజీ పార్టీ ఉపాధ్యక్షులు దివ్య వెంకట రామారావు జగ్గయ్యపేట పట్టణ మాజీ ప్రచార కమిటీ అధ్యక్షులు గోగుల వెంకయ్య జగ్గయ్యపేట పట్టణ మాజీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు గంగోలు వినోద్ కుమార్ మరియు పట్టణ వైసీపీ నాయకులు 29వ వార్డు సీనియర్ పార్టీ నాయకులు కొనకాల ప్రసాద్ భీమవరపు రమేష్ దేరంగుల తిరుపతిరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా వట్టేం మనోహర్ మాట్లాడుతూ సత్యం అహింస శాంతి మార్గాలను ప్రపంచానికి దారి చూపిన మహనీయులు మహాత్మా గాంధీజీ అని అదేవిధంగా జీవితంలో మనం మనల్ని నివసించే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇతరులను గౌరవించాలని సమాజం కోసం ప్రతి ఒక్కరం ఒక మంచి పని ఒక మంచి పని చేయాలని మహాత్మా గాంధీజీ బాటలో ప్రతి పౌరుడు నడవాలని ఆయన తెలియజేస్తూ అందరికీ మహాత్మా గాంధీ జి జయంతి వేడుకలు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తప్పదు

**- ఎడ్ల సంజీవ్, జిల్లా అధ్యక్షులు, టి యు డబ్ల్యూ జె..**






ప్రజాదివాస్

దేశవ్యాప్తంగా పనిచేస్తున్న పాత్రికేయులు మీడియా పరిశ్రమకు సంబంధించిన కీలకమైన, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని టి యు డబ్ల్యూ జె జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంజీవ్ అన్నారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ ప్రెస్ క్లబ్ నుంచి గాంధీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంజీవ్ మాట్లాడుతూ. ఐ జె యు పిలుపు మేరకు దేశ వ్యాప్త ఆందోళనలో భాగంగా నిరసన తెలుపుతున్నామని అన్నారు. ముఖ్యంగా దేశ స్థాయిలో సమగ్ర మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని అన్నారు. రెండవ పత్రికా కమిషన్‌ను 1978లో నియమించగా, అది 1982లో తన నివేదికను సమర్పించింది. గత నాలుగు దశాబ్దాలుగా, 24/7 ప్రసార నెట్‌వర్క్‌లు, డిజిటల్ వార్తా వేదికలు, ప్రజా చర్చలను తీవ్రంగా ప్రభావితం చేసే సోషల్ మీడియా వ్యవస్థల ఆవిర్భావంతో భారత మీడియా రంగం అపూర్వమైన పరివర్తనకు లోనైంది. పాత్రికేయులు, మీడియా సంస్థల భద్రత కోసం ఒక ప్రత్యేక కేంద్ర చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. పని చేసే పాత్రికేయుల కోసం చట్టబద్ధమైన రక్షణల పునరుద్ధరణ, పరిరక్షణ చట్టం చేయాలి. మీడియా ఉద్యోగుల కోసం కొత్త వేతన మండలి ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ మేరకు ఇళ్ళు, ఇళ్లస్థలాల సమస్యపరిష్కరించాలని, ఉద్యోగులకు ఇచ్చిన విధంగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇచ్చి క్యాష్ లెస్ ట్రీట్మెంట్ అందించాలని, జర్నలిస్టులపై నిత్యం జరుగుతున్న దాడులను అరికట్టేందుకు తగిన చట్టం తీసుకు రావాలని, వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టి అరవింద్ బాలాజీ, కోశాధికారి సిరిగద ప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బొబ్బిలి నర్సయ్య, జాతీయ కౌన్సిల్ సభ్యులు గంగాదాస్, సోషల్ మీడియా సభ్యులు దేవీదాస్, జిల్లా ఉపాధ్యక్షులు గోవిందరాజ్, సాయిరాం, మురళి, నవనాథ పురం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు: సుంకరి గంగామోహన్, డిచ్పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మురళి, బోధన్ డివిజన్ స్పర్జి గంగులు, తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ ద్వారా మరింత సేవలందించాలి

ప్రజాదివాస్




ఆపదలో ఉన్న వారికి రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా మరింత సేవలందించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బండారు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎంజీ రోడ్డులో ఇటీవల రెడ్ క్రాస్ సొసైటీ సూర్యాపేట జిల్లా వైస్ చైర్మన్ గా ఎన్నికైన సమాజ సేవకులు, ఆర్యవైశ్య రాష్ట్ర మహాసభ కార్యవర్గ సభ్యులు బండారు రాజా ను తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బండారు రాజా పార్టీలకతీతంగా , సంఘాల కచ్చితంగా సమాజ సేవలో ముందు ఉంటారని కొనియాడారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా నేనున్నానంటూ తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తుంటారని కొనియాడారు. వాసవి క్లబ్, లయన్స్ క్లబ్, ఆర్యవైశ్య సంఘాల్లో వారు చేసిన సేవలకు గాను ఎన్నో ఎన్నో పదవులు అధిరోహించి వన్నెతెచ్చారని తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా జిల్లాలో నిత్యం రక్తము అందుబాటులో ఉండే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పుప్పాల వీరన్న జిల్లా కార్యవర్గ సభ్యులు ఎలిపెద్ది సుధాకర్ రెడ్డి, పోతురాజు నర్సయ్య,పాలిశెట్టి శ్రీనివాస్,మంచాల శ్యాం కుమార్, పూసపల్లి వెంకన్న,దీకొండ మహేష్,సామ సవేందర్ రెడ్డి,పోగుల రాజేంద్ర ప్రసాద్ రెడ్డి, తన్నీరు రమేష్, కొప్పుల కిరణ్, రఘువీర్, గంపల సాల్మన్ ,గంగాధర సురేష్ కుమార్ ,పాడిశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇండ్ల స్థలాల హామీ ఎప్పుడు నెరవేరుస్తారు...

**- జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్**

ప్రజాదివాస్

కలెక్టరేట్: జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయిస్తామని ఇచ్చిన మాటకు కట్టుబడి వెంటనే నెరవేర్చాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అడ్వకేట్ యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం జిల్లా కలెక్టరేట్ వద్ద జర్నలిస్టులు చేపట్టిన నిరసన దీక్షకు మద్దతు తెలిపి కామేష్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర కూడా కీలకంగా కొనసాగిందని గుర్తు చేశారు,కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు రాష్ట్రంలో అధికారంలోకి వస్తే వారికి ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 3సంవత్సరాలు కావస్తున్నా ఇంతవరకు ఆ ఊసే ఎత్తడం లేదని,ఇది సరైన పద్ధతి కాదని మండి పడ్డారు.ప్రభుత్వానికీ ప్రజలకు మధ్య వారిదిగా పని చేస్తూ వృత్తి పరంగా అనేక ఒడి దుడుకులు ఎదుర్కొంటున్న విలేఖరులు జీత,భత్యాలు లేక కుటుంబాలకు విద్యా,వైద్యం అందించలేక ఆర్థికంగా చితికి పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ఇళ్ల స్థలాలు,ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని,లేనియెడల భవిష్యత్ లో జర్నలిస్టులు రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని,జేబీపీ పార్టీ జర్నలిస్టుల పోరాటాలకు



పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జున రావు,జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్,వినయ్,పుట్ట.లాలిబాబు తదితరులు పాల్గొన్నారు.

# జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలు వేసి నివాళులర్పించిన జగ్గయ్యపేట వైఎస్ఆర్సిపి నాయకులు

ప్రజాదివాస్




దంతాలపల్లి మండలంలోని కుమ్మరి కుంట్ల గ్రామంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి సర్పంచ్ కారుపోతుల సాయి దుర్గ అనిల్, ఈ సందర్భంగా మాట్లాడుతూ సత్యం అహింస శాంతి మార్గాలను ప్రపంచానికి దారి చూపిన మహనీయులు మహాత్మా గాంధీజీ అని అదేవిధంగా జీవితంలో మనం మనల్ని నివసించే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇతరులను గౌరవించాలని సమాజం కోసం ప్రతి ఒక్కరం ఒక మంచి పని ఒక మంచి పని చేయాలని మహాత్మా గాంధీజీ బాటలో ప్రతి పౌరుడు నడవాలని ఆయన తెలియజేస్తూ అందరికీ మహాత్మా గాంధీ జి జయంతి వేడుకలు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు గ్రామ అభివృద్ధికి తోడ్పడుతానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దైద ఉప్పలయ్య వార్డు మెంబర్లు సంధ్య, యాదమ్మ, రాచకొండ మధు, కోడి వెంకన్న, ఏరుకొండ సాయి, వివో ఏ చిల్ల నిరంజన్, అంగన్వాడి టీచర్ సునీత, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న రేవూరి ప్రకాశ్ రెడ్డి

**- పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి**

ప్రజాదివాస్

పరకాల పట్టణంలోని అమరవీరుల మైదానం (స్మారక భవనం) చాపల బండ యందు నిర్వహించిన జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకల్లో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా



ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యం, అహింస, శాంతి, సేవ అనే మహాత్మా గాంధీజీ చూపిన మార్గాలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.గాంధీజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అన్నారు.

# కామారెడ్డిలో వైభవంగా ది చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభం..

-ప్రారంభించిన యాంకర్ శ్రీముఖి..

-భారీగా తరలివచ్చిన అభిమానులు, కొనుగోలుదారులు

ప్రజాదివాస్



కామారెడ్డి జిల్లా కేంద్రంలో ది చెన్నయ్ షాపింగ్ మాల్ శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. ప్రముఖ యాంకర్ శ్రీముఖి మాల్‌ను ప్రారంభించారు. అనంతరం మాల్‌లోని వివిధ విభాగాలను సందర్శించి వస్త్రాలు, ఫ్యాషన్ ఉత్పత్తులను పరిశీలించారు.ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉండటంతో పెద్ద సంఖ్యలో కొనుగోలుదారులు తరలివచ్చారు. దీంతో మాల్ సందడిగా మారింది. పండుగలు, వివాహాలు, శుభకార్యాలతో పాటు నిత్య అవసరాలకు అనుగుణంగా వివిధ రకాల వస్త్రాలు, సరికొత్త ఫ్యాషన్ డిజైన్లు అందుబాటులోకి తీసుకురావడంతో వినియోగదారులు ఆసక్తిగా షాపింగ్ చేశారు. కుటుంబ సమేతంగా ఒకే చోట అన్ని రకాల వస్త్రాలను ఎంపిక చేసుకునే అవకాశం ఉండటంతో ప్రారంభం రోజే మాల్‌కు మంచి స్పందన లభించింది.ఈ సందర్భంగా యాంకర్ శ్రీముఖి మాట్లాడుతూ. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా లక్షలాది డిజైన్లతో వస్త్రాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కుటుంబ సమేతంగా మాల్‌ను సందర్శించి షాపింగ్ చేయాలని కోరారు. ది చెన్నయ్ షాపింగ్ మాల్ వినియోగదారుల నమ్మకానికి చిరునామాగా నిలుస్తుందని పేర్కొన్నారు. శ్రీముఖిని చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అభిమానులను శ్రీముఖి ఆప్యాయంగా పలకరిస్తూ, చేతులు ఊపుతూ సందడి చేశారు.

# జ్ఞానేష్ కుమార్ మోదీ, అమిత్‌షా రాజీనామా చేయాలి

- పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్

- టిపిసిసి ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



ప్రజాదివాస్

ఓట్లు, సీట్ల చోరీ వ్యవహారం లో సీఈసీ జ్ఞానేష్ కుమార్ మోదీ, అమిత్‌షా ల ఆదేశాల తో మన ప్రజాస్వామ్యవ్యవస్థ లకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయనకి పూర్తి వ్యతిరేకంగా తీసుకున్న పలు నిర్ణయాలను నిరసిస్తూ ఆయన వెంటనే రాజీనామా చేయాలనీ, ఆయనను అరెస్టు చేసి ఇటీవల జరిగిన ఎన్నికల్లో బిజేపికి అనుకూలంగా కుట్రలు పన్నిన వాటిని బయటకీ తీసి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐసీసీ ఇచ్చిన కార్యక్రమం పిలుపు మేరకు 2 వ తేదీ ఉదయం 11 ఖఎ కి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్లో బిఆర్ కే భవన్ లో ఉన్న కేంద్ర ఎన్నికల కార్యాలయం వద్ద నిరసన చేబట్టి,సిఇసి జ్ఞానేష్ కుమార్ దిష్టి బొమ్మ దగ్ధం చేసిన తర్వాత ప్రధాన కేంద్ర ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డికి మెమోరాండం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క , మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు, మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి వివేక్ వెంకటస్వామి, మంత్రి మహమ్మద్ అజర్‌ఒద్దిన్ , పార్లమెంటు సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు,టిపిసిసి ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎస్ ఎస్ ఎ చేర్మెన్ గంప వేనుగోపాల్, ఎస్ ఐ ఆర్ రాష్ట్ర చేర్మెన్ పూసపాటి రాజేశ్ కుమార్, టిపిసిసి అధ్యక్షుల పరిపాలన సెక్రటరీ ప్రసన్న శర్మ తదితరులు పాల్గొన్నారు ,మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు, టీపీసీసీ ఉపాధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు మరియు ఫ్రంటల్, డిపార్ట్మెంట్, సెల్ అధ్యక్షులు /మాజీ రాష్ట్ర ఛైర్మెన్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆర్టీసీ కార్మికుల భారీ బహిరంగ సభ

ప్రజాదివాస్

ది.04/10/2026 న భద్రాచలంలో తెలంగాణ వర్కర్స్ యూనియన్ (టీ డబ్ల్యూ ), ఎస్ డబ్ల్యూ ఎఫ్-- ఐ ఎన్ టి యు సి ఐక్య కూటమి ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ ఆదివారం భద్రాచలం ఆర్టీసీ డిపో ఆవరణలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు కూటమి నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు.ఆర్టీసీ కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, కార్మిక సంక్షేమం, పెండింగ్ సమస్యల పరిష్కారం తదితర అంశాలపై ఈ సభలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు.ఈ సభకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు, మహిళా కార్మిక సోదరీమణులు, యూనియన్ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్మికుల ఐక్యతను చాటుతూ, వారి హక్కులు మరియు సంక్షేమం కోసం నిర్వహిస్తున్న ఈ బహిరంగ సభలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్ డబ్ల్యూ ఎఫ్- టి డబ్ల్యూ యు - ఐ ఎన్ టి యు సి కూటమి భద్రాచలం డిపో కమిటీలు కోరాయి.ఈ కార్యక్రమంలో టి డబ్ల్యూ యు రాష్ట్ర అధ్యక్షులు మొగుళ్ళ.రాజి రెడ్డి,తెలంగాణ రాష్ట్ర తొలి మేయర్ బొంతు.రామ్మోహన్, ఎస్ డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎస్.రావు,కార్యదర్శి.గడ్డం.లింగ మూర్తి, ఖమ్మం రీజియన్ టి డబ్ల్యూ యు. ఎస్ డబ్ల్యూ ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు కూటమి.రాష్ట్ర,కవిత,జున్నురవి,ప్రతాప్,కె .వి .ఎస్ .రెడ్డి, నాయకులు పాల్గొంటారు. ఎస్ డబ్ల్యూ ఎఫ్ - టి డబ్ల్యూ యూ - ఐ ఎన్ టి యు సి ఐక్య కూటమి భద్రాచలం డిపో కమిటీలు జున్ను.రవిరాష్ట్ర కార్యదర్శి టి డబ్ల్యూ భద్రాచలం డిపో "కార్మికుల హక్కుల సాధనకు ఐక్య పోరాటం... భద్రాచలంలో ఆర్టీసీ భారీ బహిరంగ సభ"ఘనంగా గాంధీ, శాస్త్రి జయంతి వేడుకలు

# గాంధీజీ జయంతి సందర్భంగా గ్రామీణ ఉపాధి హామీ పని ఆ పేరుతోనే ఉండాలి

ప్రజాదివాస్

గాంధీ జయంతి రోజున సారపాక సెంటర్లో అక్టోబర్ శుక్రవారం 2 గాంధీ విగ్రహానికి పూలదండ ఏసి వినతిపత్రం ఇస్తూ నిరసన తెలియజేసిన వ్యవసాయ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో వ్యకస జిల్లా సాహయ ఖరిదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వీబిజీ రాంజీ చట్టాన్ని రద్దు చేయాలని గాంధీ పేరుతో ఉన్న ఉపాధి పనిని ఉంచాలని అన్నారు అంతేకాదు ఇవాళ ఉపాధి హామీ పనికి సంబంధించిన నిధులు కార్పొరేట్ శక్తులకు కాంట్రాక్టులకు బొజ్జ నింపుతున్న పరిస్థితి కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తుందని జాతీయ గ్రామీణ ఉపాధి పనిలో నిధులు మొత్తం కూడా ఇవాళ కాంట్రాక్టులకు కట్టబెడుతున్న పరిస్థితి కనపడుతుంది సిసి రోడ్లు దాంబర్ రోడ్లు బాయిలు డ్రైనేజీలు ఇతర మిషన్లు ద్వారా పనిచేసే పరిస్థితికి తీసుకొచ్చిన కేంద్ర మోడీ ప్రభుత్వం ఇవాళ ఉపాధి నిధులు మొత్తం కూడా కాంట్రాక్టర్లకు కట్ట పెడుతున్న పరిస్థితి ఉందని అందుకు దేశవ్యాప్తంగా ఉపాధి హామీ పాత పద్ధతిలోనే ఉండాలని ఇవ్వాలా నిత్యవసరకులు విపరీతంగా పెరిగిపోతున్నాయని సామాన్యుడు కొనుక్కునే పరిస్థితి లేదని కనీసం వేతనం 800 రూపాయలు ఇవ్వాలని రెండు వందల రోజులు పని కల్పించాలని అడిగిన వారికి వెంటనే ఉపాధి హామీ పని ఇవ్వాలని ఉపాధి హామీ నిధుల్ని దుర్వినియోగం కాకుండా ఉపాధి కార్మికులకే పని కల్పించి వారికే ఆ డబ్బుల్ని కేటాయించాలని వారికి అందే విధంగా ఉపాధి పని చూపించాలని డిమాండ్ చేశారు గ్రామపంచాయతీ గ్రామ సభలో కూడా ఉపాధి హామీ పనిని దుర్వినియోగం అవుతుందని బత్తుల వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు ఉపాధి హామీ పని అన్న చూపించండి లేదా తిండన్న పెట్టండి అని నినాదంతో వచ్చిన ఉపాధి పనిని ఇవాళ గంగలో కలిపే విధంగా



చేస్తున్న పరిస్థితి కన పడుతుందని అందుకు వ్యవసాయ కార్మికులందరూ ఏకమై మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకి ధీటుగా పోరాటంలోకి రావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో వ్యకస మండల అధ్యక్షులు ఎస్కే అబీద, మరియమ్మ, సిఐటియు కనకం వెంకటేశ్వర్లు, ఎస్ డి హుస్సేన్ బోళ్ల ధర్మ, ప్రకాష్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు

# మొబైల్ షాప్ యజమానులతో అవగాహన సమావేశం

ప్రజాదివాస్

అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మొబైల్/సెల్ షాప్ యజమానుల సంఘం సభ్యులతో అశ్వారావుపేట పోలీసులు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సెకండ్‌హ్యాండ్ మరియు గుర్తుతెలియని మొబైల్ ఫోన్ల కొనుగోలు సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, అనుసరించాల్సిన విధానాలపై మొబైల్ షాప్ యజమానులకు అవగాహన కల్పించారు.సెకండ్‌హ్యాండ్ మొబైల్ ఫోన్ కొనుగోలు చేసే ముందు విక్రేత పూర్తి పేరు, చిరునామా, మొబైల్ నంబర్ మరియు చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్ర వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే మొబైల్ ఫోన్ యొక్క ఐ ఎం ఈ ఐ నంబర్‌ను పరిశీలించి, (సెంట్రల్ ఈక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ ) పోర్టల్ ద్వారా వెరిఫై చేసిన అనంతరం మాత్రమే



కొనుగోలు చేయాలని సూచించారు.మొబైల్ ఫోన్ యొక్క ఐ ఎం ఈ ఐ నంబర్ ట్యాంపరింగ్‌కు గురై ఉన్నా, మార్చబడినా, అనుమానాస్పదంగా ఉన్నా లేదా మొబైల్ ఫోన్ దొంగిలించబడినదిగా/పోగొట్టుకున్నదిగా సి ఈ ఐ ఆర్ లో నమోదై ఉన్నా అటువంటి ఫోన్లను కొనుగోలు చేయవద్దని సూచించారు. అలాగే అనుమానాస్పద పరిస్థితుల్లో లేదా మార్కెట్ ధర కంటే చాలా తక్కువ ధరకు విక్రయించబడుతున్న మొబైల్ ఫోన్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.దొంగిలించబడిన లేదా అనుమానాస్పద మొబైల్ ఫోన్ ఏదైనా తమ వద్దకు వచ్చినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సంబంధిత విక్రేత వివరాలు, ఐ ఎం ఈ ఐ నంబర్, కొనుగోలు రికార్డులు, సీసీటీవీ ఫుటేజీ తదితర వివరాలను పోలీసులకు అందించి దర్యాప్తులో సహకరించాలని మొబైల్ షాప్ యజమానులకు సూచించారు.దొంగిలించబడిన మొబైల్ ఫోన్ల చలామణిని అరికట్టడంలో మరియు పోగొట్టుకున్న/దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు తిరిగి అందించడంలో మొబైల్ షాప్ యజమానులు పోలీసులకు సహకరించాలని అశ్వారావుపేట పోలీసులు కోరారు.

29

# గాంధీ జయంతి సందర్భంగా మహాత్మా గాంధీకి ఘన నివాళులు

కాటాపురం: జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా కాటాపురం గ్రామపంచాయతీ ఆవరణలో మహాత్మా గాంధీ చిత్రపటానికి గ్రామ సర్పంచ్ శ్రీ దిడ్డి మోహన్ రావు పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు . ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు నేటి సమాజానికి కూడా ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా గ్రామాల్లో స్వచ్ఛత, పరిశుభ్రత, శాంతి, సోదరభావం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ అభివృద్ధితో పాటు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన గ్రామాన్ని






నిర్మించడమే గాంధీజీకి ఇచ్చే నిజమైన నివాళి అని సర్పంచ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కోరం భాగ్యరాణి, ఉపసర్పంచ్ పాలకుర్తి బాబు, వార్డు మెంబర్లు పల్నాటి రాంబాబు, వఞ వీూజ దానక నర్సింగరావు,దిల్వర్ ఖాన్, తడక హరీష్, సాయి, ఎల్.పీ. వెంకటేష్, గందు బిక్షపతి, అంబేద్కర్ గ్రామ కమిటీ అధ్యక్షులు గంగెళ్ళి విజయ్, మద్దూరి రాములు, కానిస్టేబుల్ రమేష్, చిట్టినని శ్రీనివాస్, యాకుబ్, కుసుమ వెంకటేశ్వర్లు, కందగట్ల సాంబయ్య, పల్నాటి సురేష్, రంగు లాలయ్య, మారుతి అంగన్వాడి మరియు ఆశ వర్కర్లు గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొని మహాత్మా గాంధీకి నివాళులర్పించారు.